తెలంగాణ భవన్‌కు వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్న లగచర్ల, సమీప గ్రామాల బాధిత కుటుంబాల మహిళలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, రెడ్యానాయక్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తదితరులు

లగచర్ల రైతులపై థర్డ్ డిగ్రీ!

హైదరాబాద్, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): పోలీసులు ఇండ్లలోకి చొచ్చుకొచ్చి తమ వాళ్లను దొరికినవాళ్లను దొరికినట్టు లాక్కెళ్లి చిత్రహింసలు పెట్టారని లగచర్ల బాధిత రైతులు భోరున విలపిస్తున్నారు. లాఠీలతో చితకబాదారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అర్ధరాత్రి స్టేషన్లకు తరలించి గిరిజన రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితులు, వారి కుటుంబీకులు బోరుమంటున్నారు. తమను ఆదుకుని న్యాయం చేయాలంటూ గురువారం హైదరాబాద్‌లోని 'తెలంగాణ భవన్' మెట్లెక్కిన గిరిజన కుటుంబాలతో 'నమస్తే తెలంగాణ' మాట్లాడింది. బాధిత రైతుల కన్నీటి గాథ వారి మాటల్లోనే.. "సోమవారం అర్ధరాత్రి పోలీసులు కరెంటు తీశారు. మా ఇండ్లల్లోకి చొచ్చుకొచ్చారు. అందినవారిని అందినట్టు వ్యాన్లలో బలవంతంగా ఎక్కించారు. 55 మందిని స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ నేతల సూచనతో పార్టీల వారీగా విడదీశారు. ఆందోళనల్లో పాల్గొన్న బీజేపీ, కాంగ్రెస్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, వారి పేర్లను తొలగించారు. బీఆర్‌ఎస్ వాళ్లమంటూ తమపై చిత్రహింసలకు పాల్పడ్డారు. నలుగురైదుగురిని వేర్వేరు సెల్‌లలో వేసి, బీఆర్‌ఎస్ ముఖ్యనేతల పేర్లు చెప్పాలంటూ ఒళ్లంతా దద్దులు వచ్చేలా లాఠీలతో చితకబాదారు. అరికాళ్లు, పిరుదులు, వీపు, చేతులపై కొట్టారు. ఆ దెబ్బలతో నడవలేని స్థితికి చేరుకున్నాం. మొత్తం వ్యవహారం కాంగ్రెస్ పార్టీ పెద్దల డైరెక్షన్‌లోనే జరిగింది." అంటూ ఒంటిపై దెబ్బలు చూపిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు.

సంపినా భూములియ్యం

మొదటిపేజీ తరువాయి...

మీడియాతో మాట్లాడించారు. తాను తొమ్మిది నెలల గర్భవతినని చూడకుండా పోలీసులు తన పట్ల దుర్మార్గంగా వ్యవహరించారని బాధితురాలు జ్యోతి ఈ సందర్భంగా కన్నీటి పర్యంతమయ్యారు. కలెక్టర్, అధికారులపై ఎలాంటి దాడి చేయకపోయినా, అర్ధరాత్రి వచ్చి తన భర్తను బలవంతంగా పట్టుకుపోయారని, అక్కడ స్టేషన్‌లో తెల్లార్లు చావబాదారని బోరుమన్నది. లగచర్లలో 24 గంటలు అధికారుల సర్వేలు కొనసాగుతున్నాయని, డ్రోన్లతో సర్వే చేస్తున్నారని జ్యోతి చెప్పారు. 'మా ఇండ్ల వద్దకొచ్చి.. మీ భూములు ఇచ్చేయండి, ఫార్మా కంపెనీ పెడుతున్నమని చెప్తున్నారు. సర్వేల పేరుతో రోజూ మా ఇండ్ల చుట్టూ తిరుగుతున్నరు. బుధవారం తిరుపతిరెడ్డి వచ్చి భూములివ్వాలని చెప్పి వెళ్లిండు. అధికారులు కూడా మా భూములు తీసుకుంటామని బెదిరిస్తున్నరు. మాకు ఫార్మా కంపెనీ అక్కర్లేదు.. కంపెనీ పెడితే మా భూములు నాశమవుతయి' అని ఆవేదన వ్యక్తం చేసింది.

సంతకాల కోసం రోజూ బెదిరిస్తున్నరు

'మా భూములు పోతాయన్న బాధతోనే అధికారులను నిలదీశాం. మాకెవరూ చెప్పలేదు. ఏ ఒక్కరి మీద దాడి చేయలేదు' అని మరో బాధితురాలు రత్నాబాయి చెప్పారు. 'రోజూ అధికారులు ఇండ్ల వద్దకు వచ్చి సంతకాలు పెట్టాలని, భూములియ్యాలని, స్వచ్ఛందంగా ఇవ్వకుంటే బలవంతంగా తీసుకుంటామని బెదిరిస్తున్నరు' అని భయాందోళన వ్యక్తంచేసింది. ఉన్న భూములను సర్కరు లాక్కుంటే తామెలా బతకాలని అక్కడికొచ్చిన బాధితులంతా గోడు వెళ్లబోసుకున్నారు. తమ ప్రాణాలు పోయినా భూములు ఇవ్వబోమని వారంతా తేల్చి చెప్పారు.

కేసీఆర్ మాట ఇది.. అండగా ఉంటాం

'తెలంగాణ భవన్‌కు వచ్చిన గిరిజన ఆడబిడ్డలకు మాట ఇస్తున్నా.. బీఆర్‌ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది. ఇది కేసీఆర్ సార్ మాటగా చెప్తున్నా. మీ భర్తలు, కొడుకులు, మనుమళ్లు, మీవాళ్లు మళ్లీ మీ ఇండ్లకు చేరేవరకూ మీ తరపున కొట్లాడతాం. మీరెవ్వరూ అధైర్యపడొద్దు' అని కేటీఆర్ భరోసా ఇచ్చారు. లగచర్ల, సమీప 5 తాండాల నుంచి న్యాయం కోసం తెలంగాణ భవన్‌కు వచ్చిన గిరిజన ఆడబిడ్డల ఆవేదన విన్న కేటీఆర్.. భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'మీ తరపున మేమే కోర్టులకు పోతాం, న్యాయం కోసం కొట్లాడుతామని చెప్పారు. ఇన్నాళ్ల నుంచి బీఆర్‌ఎస్‌పై, మా నేతలపై అడ్డగోలుగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలంతా ఒక్కసారి వీళ్లు చెప్పేది వినండి.. మేము రెచ్చగొట్టామని మీరంటున్నారు.. లేదు స్వచ్ఛందంగా ఆందోళన చేస్తున్నామని బాధితులు అంటున్నారని కేటీఆర్ చెప్పారు. నోటీసులు కూడా ఇవ్వలేదని స్పష్టంగా చెప్తున్నారు.. ఎవరూ చెప్పలేదని, ఫార్మా ఎందుకు పెడుతున్నారో చెప్పలేదని వారు చెప్పారని తెలిపారు. 9 నెలలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని బాధితులే అంటున్నారని చెప్పారు. ఆ మాటలు మీకు వినిపిస్తలేదా? ఇంతమంది రైతులు, ఆడబిడ్డల బాధను రాజకీయ కుట్రగా చిత్రీకరిస్తారా? ఇక ఉపేక్షించేది లేదు. దీనిపై న్యాయపోరాటం చేస్తాం.. అని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ స్పందించాలని, జాతీయ మానవహక్కుల కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ స్పందించి బాధిత రైతులపై థర్డ్ డిగ్రీని సుమోటు కేసుగా తీసుకొని వెంటనే విచారణ జరపాలని కోరారు. బాధితులకు మేము అండగా ఉంటాం' అని కేటీఆర్ తేల్చి చెప్పారు.

నిండు గర్భిణి అని కనికరం చూపలే

నా భర్త ప్రవీణ్. రోజూ ఉదయం, సాయంత్రం ఇంటింటికి వెళ్లి పాలు పోస్తాడు. నేను తొమ్మిది నెలల గర్భవతిని. అర్ధరాత్రి మా ఇంటి చుట్టుపక్కల లైట్లు ఆపి ఓ పెద్ద నేరస్తుడిని పట్టుకుపోయినట్టు పట్టుకుపోయారు. నేను నిండు గర్భిణిని, నాకెవరూ దిక్కులేరని చెప్పినా కనికరించలేదు. కడుపుతో ఉన్న నన్ను పక్కకు తోసేసి నా భర్తను బలవంతంగా తీసుకెళ్లారు. ఈ ఫార్మా సిటీ వల్ల మాకున్న భూమి, ఇల్లుతో సహా పోతుందని చెప్పారు. అందుకే మా ఆయన పోయిండు. నా భర్త ఎవరిపైనా దాడి చేయలేదు. ఆ వీడియోల్లో కనిపిస్తుండని తీసుకెళ్లి జైల్లో వేశారు. మమ్మల్ని ఎవరూ ప్రోత్సహించలేదు. మా భూములు పోతాయనే పోరాడాం. దుద్యాలలో తిరుపతిరెడ్డి మీటింగ్ పెట్టి.. అందరూ తప్పనిసరిగా భూములివ్వాలని చెప్పిండు. నేను కడుపుతో ఉన్నా.. నన్ను చూసి మా ఆయన భోరుమన్నడు. స్టేషన్‌లో బాగా కొట్టారని మస్తు ఏడ్చిండన్నా. (కేటీఆర్‌తో) నాకు దుఃఖం ఆగుతలేదన్నా (భోరున విలపిస్తూ).. – జ్యోతి, లగచర్ల

కొట్టినా చంపినా.. ఇక్కడే ఉంటం

పుట్టిన నాటి నుంచి ఈ భూములతో మాకు అనుబంధం ఉంది. ఒక్కసారిగా భూములు ప్రభుత్వానికి అప్పజెప్పాలని అంటే మేం ఎక్కడికి వెళ్లాలి, ఎలా బతకాలి. నిన్న రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి వచ్చి ఫార్మా కంపెనీ కచ్చితంగా వస్తుందని అంటున్నారు. కొట్టినా, చంపినా ఇక్కడే ఉంటం. నెట్, లైట్లు ఆర్పివేసి ఇండ్లలోకి పోలీసులు ఎందుకొచ్చారు. ఏమీ ఎరుగని వారిపైనా కేసులు పెట్టి వేధిస్తున్నారు.

–పూజ, నీట్ ప్రిపరేషన్ విద్యార్థి, రోటిబండతాండ

తిండి, నిద్రలేకుండా గడుపుతున్నం

మా గంజి మేము తాగి బతుకుతున్నం. పొట్టకూటి కోసం మా ఇంట్లో వాళ్లంతా వలసెల్లిండ్రు. నేను నా మనుమళ్లను, మనుమరాళ్లను పెట్టుకొని కాలం గడుపుతున్న. మేకలు, పశువులను మేపుకొంటూ జీవిస్తున్నాం. భూములు పోతున్నాయనే బాధలో ఉండి తిండి కూడా తినడం లేదు. నిద్ర పట్టడం లేదు. ఫార్మా కంపనీలు పెడితే ఇక్కడ బతికేది కష్టమే అంటున్నారు. మాకు ఏమీ తెల్వదు. ఎవుసం చేసుడే తెలుసు.

–ముత్యాలీబాయి, రోటిబండ తండా

దాడులు చెయ్యమని ఎవరూ చెప్పలె..

మాకున్న ఐదెకరాల్లో పండే పంటే మాకు ఆధారం. మా భూముల్లో ఫార్మా కంపెనీ పెడుతున్నరని, భూమిని లాక్కుంటమంటే ఇవ్వబోమని అధికారులకు తేల్చి చెప్పినం. సంతకాలు పెట్టాలని చెప్పారు. ఉన్న ఆధారం పోతుంటే ఎలా ఊరుకుంటం. అధికారులను నిలదీశాం తప్ప ఎవరిపైనా దాడులు చేయలేదు. దాడులు చేయాలని మాకు ఏ పార్టీ చెప్పలేదు. ఏ నాయకుడూ అండగా లేడు. మా కడుపులు మండి నిలదీశాం. నా భర్తను అరెస్టు చేసి జైళో పెట్టారు. ఆయన్ని ఎక్కడుంచారో కూడా తెలియదు.

– గోబిబాయి, లగచర్ల

అర్ధరాత్రి తలుపులు పగులగొట్టి లోనికొచ్చి..

మాకున్న పొలమే మాకు జీవనాధారం. ఫార్మా కంపెనీ కోసం మా పొలాలు కావాలని అడిగారట. మా ఇరుగు పొరుగు వాళ్లు చెప్తే తెలిసింది. నా భర్త గొడవల దగ్గరకు పోనే లేదు. ఆ గొడవ గురించే మాకు తెలియదు. పొద్దంతా పొలం పనులకు పోయొచ్చి తిని పడుకున్నం. అర్ధరాత్రి పోలీసులు తలుపులు పగులగొట్టి లోపలికి వచ్చారు. నా భర్తను బలవంతంగా లాక్కెళ్లారు. ఎందుకు తీసుకెళ్తున్నారంటూ అడిగేలోపు మమ్ముల్ని పక్కకు తోసేశారు. నా భర్తకు ఆరోగ్యం బాగాలేదు. రూ.20 వేలు పెట్టి ట్రీట్‌మెంట్ చేయించాం.

– అనంతమ్మ, హకీంపేట

తిరుపతిరెడ్డి సంతకాలు పెట్టమన్నాడు

కొద్దిపాటి పొలంలో వరి, కందులు పండించుకుంటున్నం. నోటి కాడి కూడును లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉన్న భూమి పోతే ఎలా బతకాలి? అధికారులొచ్చి ఫార్మా కంపెనీకి భూమిలియ్యమంటుర్రు. మీకు మా భూములే దొరికాయా. ఉన్న భూములు ఇచ్చేసి ఎలా బతకాలి? మొన్న తిరుపతిరెడ్డి వచ్చి ఫార్మా కంపెనీ వస్తుంది.. సంతకాలు పెట్టాలని అన్నడు. ఫార్మా కంపెనీ పెడితే మా ఊరు నాశనమైపోతుంది. ఇందేటని అడిగినందుకు నా భర్తను అర్ధరాత్రి తీసుకెళ్లారు. ఏ జైల్లో ఉంచారో కూడా తెలియదు.

– దేవీబాయి, లగచర్ల

అయ్యా.. నా మనుమడిని ఇడిచిపెట్టుర్రి

నా కొడుకు బతుకుదెరువు కోసం దేశం గాని దేశానికి వెళ్లిండు. ఇంట్లో నా మనుమడు, బిడ్డలతో ఉంటున్న. అర్ధరాత్రి వచ్చి నా మనుమడిని బలవంతంగా తీసుకెళ్లిర్రు. నా మనుమడు చిన్న బిడ్డ. గొడవలంటే తెలియదు. అసలు ఆ గొడవ విషయమే వాడికి తెలియదు. మాకున్నదే మూడెకరాలు. అలాగని మా భూములు తీసుకుంటామంటే అస్సలు ఊరుకునేది లేదు. జానెడు భూమికి కొట్టుకుసచ్చే రోజులివి. నాకున్న భూమి మొత్తం ఇవ్వమంటే ఎలా? వాడు చిన్నోడు వదిలిపెట్టండి బాంచెన్.

– వాల్కీబాయి, లగచర్ల

లగచర్ల రైతుల పోరాటాన్ని వక్రీకరిస్తారా?

- కార్పొరేట్ల కోసమే రేవంత్ సర్కారు దూకుడు
- సుందరీకరణ పేరుతో సాగుతున్న బుల్డోజర్ల పాలన
- ప్రజలు జీవించే హక్కును హరించి వేస్తున్నారు
- మావోయిస్టు పార్టీ ప్రతినిధి జగన్ బహిరంగ లేఖ
- అప్రజాస్వామిక పాలనపై మిలిటెంట్ పోరాటాలకు పిలుపు

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): కొడంగల్ నియోజవర్గం లగచర్ల గ్రామంలో ఫార్మాసిటీని ప్రజలు, రైతులు వ్యతిరేకిస్తూ.. ఆ జీవన్మరణ పోరాటంలో మిలిటెంట్ ఉద్యమం చేపడితే వారిపై కేసులు పెడతారా? లగచర్ల రైతుల పోరాటాన్ని వక్రీకరిస్తారా? అంటూ తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాపాలన, ప్రజాస్వామ్యం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఓ లేఖను విడుదల చేశారు. 'లగచర్ల గ్రామంలో ఫార్మాసిటీని నిర్మించి, ప్రాకృతిక వనరులతోపాటు రైతుల పంట భూములను కొల్లగొట్టడానికి పథకం పన్నారు. భూములు కోల్పోతున్న లగచర్ల రైతులు తమ జీవన, మరణ పోరాటంలో మిలిటెంట్ ఉద్యమం చేపట్టారు. ప్రజల న్యాయమైన పోరాటాన్ని వక్రీకరించి రైతులపై కేసులు బనాయిస్తారా?' అని జగన్ ప్రశ్నించారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నది. ఈ కాలంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం దూకుడుగా పని చేస్తున్నది. పౌరుల ప్రాథమిక హక్కులను, జీవించే హక్కును కాల రాస్తున్నది. రాష్ట్రాన్ని కార్పొరేట్లకు కట్టపెట్టడానికి ఆర్థిక అభివృద్ధి పేరుతో సులభతర వాణిజ్య విధానం అమలు చేస్తూ కార్పొరేట్ సంస్థల విస్తృత పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అర్ధరాత్రి ఇండ్లు కూలగొడతారా?

'హైదరాబాద్‌ను గ్లోబలైజేషన్ చేయడానికే మూసీ నది సుందరీకరణ, రివర్‌బెడ్ ప్రక్షాళన, అక్రమ కట్టడాల పేర్లతో బుల్డోజర్ల పాలన కొనసాగిస్తున్నారు. మూసీ నదిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పి.. దేశ, విదేశీ కార్పొరేట్లను ఆహ్వానిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో అక్రమంగా నిర్మించిన బడా వ్యక్తుల, సంస్థల పెద్ద, పెద్ద అంతస్తులను వదిలేసి ప్రభుత్వాలు ఇచ్చిన అన్ని రకాల అనుమతులతో ఇండ్లు కట్టుకొని, దశాబ్దాలుగా నివాసం ఉంటున్న మధ్య తరగతి, పేద ప్రజలను అక్రమదారులుగా ప్రకటించారు. న్యాయపరమైన అనుమతులు పక్కన పెట్టి, ప్రజలకు ఎలాంటి ముందుస్తు సమాచారం గాని, నోటీస్‌లు గాని ఇవ్వకుండా అధికార మదంతో దౌర్జన్యపూర్వకంగా, ఆకస్మికంగా రాత్రికి రాత్రి వచ్చి బుల్డోజర్లతో కష్టజీవులు నిర్మించుకున్న నివాసాలను కూల్చేసి వారి జీవించే హక్కును హరించి వేస్తున్నారు' అంటూ జగన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ఏడాదిలోనే ఆరుగురిని చంపేశారు..

'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వంతో అంటకాగుతూ మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో విప్లవకారులపై ఫాసిస్టు దాడులకు పూనుకున్నది. కార్పొరేట్ల లాభాల కోసం కొమ్ముకాస్తూ సీఎం రేవంత్‌రెడ్డి వారి నమ్మిన బంటునని నిరూపించుకోవడానికి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాడు. వారి పెట్టుబడుల్లో వాటా, పెద్ద మొత్తంలో కమీషన్లు పొందుతున్నాడు. తెలంగాణ ప్రజలారా.. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ల అనుకూల, ప్రజావ్యతిరేక, అప్రజాస్వామిక, పాశవిక పాలనను ఖండించండి. ఫార్మాసిటీని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వీరోచితంగా మిలిటెంట్ ఉద్యమాలు చేపట్టండి' అంటూ జగన్ పిలుపునిచ్చారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేఆర్ సురేశ్‌రెడ్డి. చిత్రంలో నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, ముఠా గోపాల్, మాణిక్‌రావు, రాగిడి లక్ష్మారెడ్డి

అరెస్టులకు భయపడం

- అవసరమైతే జైలుభరోకు పిలుస్తాం
- ఫోన్‌లో మాట్లాడుడే ప్రామాణికమైతే డీజీపీని అరెస్టు చేస్తారా?
- ప్రజా తిరుగుబాటు కుట్రనా?
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నిలదీత
- ఊరికో కేసీఆర్.. కేటీఆర్: వేముల
- ఘటనకు రేవంతే కారణం: కొప్పుల
- కేసీఆర్ హయాంలో ఇలాంటివి జరిగాయా: శ్రీనివాస్‌గౌడ్
- ప్రజావిశ్వాసం కోల్పోయిన రేవంత్: కేఆర్ సురేశ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): అరెస్టులు, కేసులు, జైళ్లకు బెదిరేది లేదని బీఆర్‌ఎస్ నేతలు, పలువురు మాజీ మంత్రులు స్పష్టంచేశారు. ఆరు గ్యారెంటీల అమలు డిమాండ్ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ సర్కార్ వేస్తున్న ఎత్తుగడల్లో భాగమే అరెస్టులని స్పష్టంచేశారు. ప్రభుత్వం ఇష్టానుసారం కేసులు పెడ్తామంటే ఊరుకునేది లేదని, అవసరమైతే జైలుభరో కార్యక్రమాలకు పిలుపు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కొడంగల్ ప్రజలు దయతలిస్తే సీఎం అయ్యాననే సంగతిని రేవంత్‌రెడ్డి మరచిపోవద్దని హితవు చెప్పారు. సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కొడంగల్‌లో పది నెలలుగా తమ భూములు ఇవ్వబోమని రైతులు చెప్తున్నా వినకుండా ప్రభుత్వం వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడంలేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం 14 వేల ఎకరాలు సేకరిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, కోదండరెడ్డి తదితరులు ప్రాజెక్టులు, రిజర్వాయర్లకు భూములు ఇవ్వవద్దని రైతులను రెచ్చగొట్టారని పేర్కొన్నారు. కానీ, ఇవ్వాళ బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధికి ఆటంకమని, ప్రజలను రెచ్చగొడుగుతున్నదని, కుట్రలు చేస్తున్నదంటూ అదే కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారని దుయ్యబట్టారు. కార్యకర్తలు, నరేందర్‌రెడ్డికి, నరేందర్‌రెడ్డి.. కేటీఆర్‌కు ఫోన్ చేశారని అందువల్ల ఇందులో కుట్ర ఉన్నదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అభాండాలు వేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఫోన్లు చేయడమే ప్రామాణికం అయితే కేటీఆర్ కూడా డీజీపీకి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారని, మరి డీజీపీని కూడా అరెస్టు చేయాలా? అని ప్రశ్నించారు.

ఊరికో కేసీఆర్..కేటీఆర్ : ప్రశాంత్‌రెడ్డి

ఆరు గ్యారెంటీల అమలు కోసం కేటీఆర్, హరీశ్‌రావు నిలదీస్తుంటే తట్టుకోలేక సీఎం డ్రామాలు ఆడుతున్నారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. కేటీఆర్‌ను ఎట్లయినా అరెస్టు చేయాలనే ఫోబియా సీఎంకు పట్టుకున్నదని ధ్వజమెత్తారు. ఫార్ములా–ఈ రేసులో ఏమీలేదని తేలిపోవటంతో లగచర్లలో రైతుల తిరుగుబాటుకు కుట్ర కోణం ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేస్తే ప్రశ్నించరని అనుకుంటే పొరపాటని, ఒక్కరిని అరెస్టు చేస్తే వందల మంది ప్రశ్నిస్తరని చెప్పారు. ప్రతి ఊరికో కేసీఆర్, కేటీఆర్ ఉన్నారని హెచ్చరించారు.

కేసులు ఉపసంహరించుకోవాలి: కొప్పుల

రైతుల కడుపుమంటకు సీఎం రేవంత్‌రెడ్డే కారణమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టంచేశారు. లగచర్ల అనంతర పరిణామాల్లో రైతులు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. లగిచర్ల ఘటనలో పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

దాడిని ఖండించాం: శ్రీనివాస్‌గౌడ్

కలెక్టర్ సహా అధికారులపై జరిగిన దాడిని తాము ఖండించామని, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, రైతుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో ఇటువంటి ఉదంతాలున్నాయా? అని ప్రశ్నించారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన రేవంత్ సర్కార్: కేఆర్ సురేశ్‌రెడ్డి

2014 నుంచి 2023 వరకు వేలాది ఎకరాల భూమని కేసీఆర్ ప్రభుత్వం సేకరించిందని, ఎక్కడా ఏ చిన్న సంఘటన జరగలేదని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి స్పష్టంచేశారు. కేసీఆర్ హయాంలో భూ సేకరణ కోసం బలవంతంగా భూములు గుంజుకున్నారని ఎక్కడైనా అన్నారా? అని ప్రశ్నించారు. భూసేకరణ విషయంలో కేసీఆర్ దేశానికే ఆదర్శమని కొనియాడారు. లగిచర్ల ఘటనతో రేవంత్ ప్రభుత్వం ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిందని చెప్పారు.

కేటీఆర్‌కు శిక్ష తప్పదు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): లగచర్లలో కలెక్టర్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. అధికారులపై దాడి హేయమైన చర్య అని, ఈ దాడిలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే మొదటి ముద్దాయి అని ఆరోపించారు. ఆయనకు శిక్ష తప్పదని పేర్కొన్నారు. ఈ ఘటనలో భాగమైన ఎవర్నీ వదలొద్దని, ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అడ్డుకునేవారంతా నేరస్థులేనని పేర్కొన్నారు. ఈ ఫార్ములా రేస్ విషయంలో లావాదేవీలు జరిగినట్టు పక్కా ఆధారాలున్నట్టు తెలిపారు.

కేటీఆర్ పాత్రపై విచారణ జరుపాలి: వీరేశం

హైదరాబాద్, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): లగచర్ల ఘటనలో కేటీఆర్ పాత్రపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, ఆయన పాత్ర ఉంటే వెంటనే అరెస్టు చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం డిమాండ్ చేశారు. కేటీఆర్ కుట్రలో భాగంగానే మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఈ దాడికి ప్లాన్ చేశారని ఆరోపించారు. కొడంగల్‌లో దళిత, గిరిజన, బీసీ బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ జరుపుతుండగా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అక్కసుతో కేటీఆర్ ఇలా వ్యవహరించారని పేర్కొన్నారు.

రండి.. రండి.. దయచేయండి!

- దాడి ఘటన తర్వాత లగచర్లకు తిరుపతిరెడ్డి
- అధికార హోదాలేని సీఎం సోదరుడికి అధికారుల రాచమర్యాదలు
- ఎంపీ, ఎమ్మెల్యేలను ఊర్ల దరిదాపుల్లోకి రానీయని పోలీసులు
- సీఎం అన్న వస్తున్నాడంటే లగచర్ల పరిసర ప్రజల ఉలికిపాటు

హైదరాబాద్, నవంబరు 14 (నమస్తే తెలంగాణ): మూడు రోజుల పాటు అదో నిషేధిత ప్రాంతం. ఆ ప్రాంత దరిదాపుల్లోకి వెళ్లకుండా పోలీసుల నిర్బంధ ఆంక్షలు. అలాంటి ప్రాంతానికి ఓ వ్యక్తి మందీ మార్బలంతో వెళ్లారు. ఆయన కనీసం వార్డు మెంబర్ కూడా కాదు. కానీ ఆయన వచ్చారంటే అధికారులు వంగి వంగి సలాములు కొడుతుంటే రండిరండి అంటూ పోలీసులు బందోబస్తు ఇస్తున్నారు. ఆయనే ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి. అందుకే జిల్లా కలెక్టర్ ఎదురువెళ్లి స్వాగతం పలుకుతారు. అదనపు కలెక్టర్ పరుగున వెళ్లి పుష్పగుచ్ఛం ఇస్తారు. ఎంపీ, ఎమ్మెల్యేలను ఆ ప్రాంతానికి వెళ్లకుండా అడ్డుకునే పోలీసులు సదరు వ్యక్తికి రూల్స్ నహీ జాన్తా అంటారు.

భయం గుప్పిట్లో జనాలు

లగచర్ల ప్రాంతంలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న భూసేకరణ ఆ ప్రాంత రైతులకు ప్రాణ సంకటంగా తయారైంది. గత సోమవారం జరిగిన ఘటనతో ఆ ప్రాంతాలన్నీ నిర్మానుష్యంగా మారాయి. యువకులు ఇతర ప్రాంతాలకు వెళ్లి తలదాచుకుంటున్నారు. గురువారం లగచర్ల బాధిత గిరిజన మహిళలు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌తో పాటు తెలంగాణ భవన్‌లోనూ తమ దుర్భరస్థితిని వివరించారు. పోలీసులు ఎన్ని బాధలు పెడుతున్నారో వివరిస్తూ తిరుపతిరెడ్డి తమ గ్రామానికి వచ్చారంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, ఇతరులను అటువైపు కన్నెత్తి చూడనీయని పోలీసులు ఎలాంటి ప్రోటోకాల్ లేని సీఎం సోదరుడిని మాత్రం అక్కడికి అనుమతించి తమకు ఏం సంకేతాలు ఇవ్వాలనుకుంటున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఓట్లేసిన జనంపై కన్నెర్ర

లగచర్లలో జరిగిన ఘటనలో అధికారులపై దాడిని ఖండిస్తున్నవారు సైతం అమాయక రైతుల బాధను అర్థం చేసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఈ క్రమంలో తమ ప్రాణంలా భావించే భూముల్ని కోల్పోయేందుకు వారు సిద్ధంగా లేరనే విషయాన్ని వాళ్లు తమ ఆక్రోశం ద్వారా వెల్లడించారని చెబుతున్నారు. కానీ సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి మాత్రం ఓట్లేసిన జనంపై మళ్లీ కన్నెర్రజేస్తున్నారు. గతంలో "మీరు భూములియ్యకున్నా బరాబర్ గుంజుకుంటాం" అంటూ తీవ్ర దుర్భాషలాడుతూ రైతులను కించపరిచిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. బుధవారం కూడా అదే స్థాయిలో "భూముల్ని వదిలేది లేదు" అంటూ ప్రకటనలు చేశారు. వికారాబాద్ కలెక్టరేట్‌కు వెళ్లిన తిరుపతిరెడ్డికి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర యంత్రాంగం సాదరంగా ఆహ్వానం పలకడం సభ్య సమాజాన్ని నివ్వెరపరిచింది. ఈ సందర్భంగానే లగచర్ల ప్రాంతంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు తథ్యం... భూములు గుంజుకునేది ఖాయం అనే సంకేతాలిచ్చిన తిరుపతిరెడ్డి తిరిగి లగచర్లకు వెళ్లారు. అక్కడ కొందరు అనుచరులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఇంత జరిగినా... తిరుపతిరెడ్డి తిరిగి తమ గ్రామానికి రావడంతో రైతు కుటుంబాల్లో కలవరం మొదలైంది. స్థానిక మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను కొడంగల్ దరిదాపుల్లోకి రానీయకుండా అడ్డుకుంటున్న పోలీసులు పుండు మీద కారం చల్లినట్టుగా సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి లగచర్లకు వెళ్లడాన్ని అనుమతించడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదేనా ప్రజాపాలన?

ప్రజాపాలనలో ప్రజాస్వామ్య దుస్థితి. ప్రజాప్రతినిధి కాకుండానే సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి ప్రభుత్వ, అధికార యంత్రాంగం నిబంధనలు తుంగలో తొక్కి ప్రోటోకాల్ కల్పించడం. ప్రాణాలు పోయినా సరే... భూములిచ్చేది లేదంటూ పోరాటం చేస్తున్న లగచర్ల పరిసర గ్రామాల ప్రజలు ఇప్పుడు తిరుపతిరెడ్డి రాకతో మరింత భయం గుప్పిట్లోకి వెళ్లారు. తమ ఆక్రోశం, ఆవేదనను అర్థం చేసుకోకపోతారా అని ఆశతో ఉన్న ఆ బడుగు బలహీన, గిరిజన రైతులు... సీఎం సోదరుడి పర్యటనలోని ప్రకటనలతో హడలెత్తిపోతున్నారు.

లగచర్ల ఘటనపై ఏడీజీ సమీక్ష

పరిగి, నవంబర్ 14: లగచర్లలో దాడి ఘటన, కేసు నమోదుతోపాటు అరెస్టులు, తదుపరి చర్యలపై అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ పరిగిలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. సుమారు 4 గంటలకు పైగా ఐజీ సత్యనారాయణ, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డితో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా లగచర్ల గ్రామంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులపై జరిగిన దాడి, ఇతర వివరాలను తెలుసుకున్నట్టు సమాచారం. కేసు నమోదు తర్వాత అరెస్టులు, తదుపరి చర్యలపై చర్చించినట్టు తెలిసింది.